ఎన్నికల నిర్వహణపై శిక్షణ

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 23: ఎన్నికల నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లకు వర్చువల్ విధానం ద్వారా మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన, డీఆర్వో మధుసూదన్‌రావు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఫ్లయింగ్ స్క్వాడ్, స్టేట్ సర్వైలియన్స్ టీమ్, రాష్ట్ర జిల్లా నోడల్ అధికారులకు ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ రూపొందించిన ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టమ్ యాప్‌పై పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు.

అరకొర వేతనాలు



కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 23: సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆక్రందనాలు, ఆకలి కేకలు ప్రభుత్వానికి పట్టడం లేదు. ఉద్యోగ భద్రత లేక చాలీ చాలని వేతనాలతో అల్లాడుతున్నారు. నాలుగైదు నెలలకొకసారి జీతాల గ్రాంటును విడుదల చేస్తుండటంతో కుటుంబాల భారాన్ని మోయలేక ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అయినా ఆ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అరకొర వేతనాలతో విధులు నిర్వహించలేమని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లా సమగ్రశిక్షలోని అన్ని కేటగిరీల్లో కలిసి 1984 మంది పని చేస్తున్నారు. ఇందులో ఔట్‌సోర్సింగ్ కింద 595 మంది, కాంట్రాక్టు విధానంలో 1389 మంది ఉన్నారు. కేటగిరీల వారీగా రూ.18,000 నుంచి రూ.32 వేల వరకు వేతనాలు ఉన్నాయి. దీర్ఘకాలంగా పని చేస్తున్నా ఉద్యోగం గ్యారెంటీ అనే నమ్మకం లేదు. అధికారుల ఆగ్రహానికి గురైనా, లేదా అధికార ప్రజాప్రతినిధులకు కోపం వచ్చినా ఉద్యోగం ఊడుతుందన్న భయంతో పని చేయాల్సిన పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రాజెక్టులో ఒకే క్యాడర్ ఉద్యోగులకు రకరకాల వేతనాలు చెల్లిస్తున్నారు. ఎన్నికల ముందు పాదయాత్రలో సీఎం జగన్ మోహన్ రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ ఇచ్చి జాబ్ గ్యారెంటీ ఇస్తామని మాయ మాటలు చెప్పి గద్దెనెక్కి తర్వాత వాగ్దానాలను మరిచారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

- సమాన పనికి సమాన వేతనం ఏదీ..?
- ఆందోళనలో ఎస్ఎస్ఏ కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ ఉద్యోగులు

డిమాండ్లు ఇవే..

- సమగ్ర శిక్షలో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలి.
- ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్‌పీ పాలసీ అమలు చేయాలి
- ప్రస్తుత ఉన్న పార్ట్‌టైమ్ విధానాన్ని రద్దు చేసి వేతనాలు పెంచి ఫుల్‌టైమ్ కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలి.
- ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ఫుల్‌టైమ్ కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చి జీతాలు పెంచి ఇవ్వాలి.
- రూ.10 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ గ్రాచ్యుటీ కల్పించాలి. సామాజిక భద్రత పతకాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలి.
- ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62కు పెంచాలి. వేతనంతో కూడిన మెడికల్ లీవ్స్ మంజూరు చేయాలి.
- మరణించిన ఉద్యోగుల కుటుంబాలను కారుణ్య నియామకాలు చేపట్టి ఆదుకోవాలి. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్స్ మంజూరు చేయాలి.
- ఉద్యోగులందరికీ ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లించాలి.

ఉద్యోగ భద్రత కల్పించాలి



సమగ్ర శిక్షలో పని చేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలి. పదవీ విరమణ వయస్సు 62కు పెంచాలి. ప్రభుత్వ ఉద్యోగులను బెనిఫిట్స్ వర్తింపజేయాలి. అరకొర వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేక.. ఇటు విధులు నిర్వహించలేక సతమతమవుతున్నట్లు వివరించారు. ప్రభుత్వం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి.

రఫీ, జేఏసీ నాయకుడు

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జేఏసీ) కర్నూలు ఎస్ఎస్ఏలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. ఒకే క్యాడర్‌లో పని చేసే వారికి రకరకాల వేతనాలు చెల్లించడం సరికాదు. కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేసి పార్ట్ టైమ్ ఎంప్లాయిస్‌ను ఫుల్‌టైమ్ కాంట్రాక్టులోకి మార్చి జీతాలు పెంచి ఇవ్వాలి. ఎన్నికల ముందు పాదయాత్రలో తమకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి.

\- చంద్రశేఖర్ రాజు



ఉద్యోగుల మానవహారం (ఫైల్)



జేఈఈ మెయిన్-1 పరీక్షలకు సర్వం సిద్ధం

నేడు బీ ఆర్క్ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 23: దేశంలోని ప్రఖ్యాత విద్యాసంస్థలలో ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశానికి నిర్వహించే జేఈఈ మెయిన్ ఫేస్-1 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష బుధవారం నుంచి ఫిబ్రవరి 1 వరకు కొనసాగుతాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అన్ని ఏర్పాట్లు చేసింది. 24న మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు బీ ఆర్క్ కోర్సు పరీక్ష జరుగనున్నది. ఈ కోర్సుకు సంబంధించి విద్యార్థులకు అడ్మిట్ కార్డులను విడుదల చేశారు. కర్నూలులోని చెక్‌పోస్టు దగ్గర ఉన్న సనత్‌నగర్‌లోని అయాన్ డిజిటల్ సెంటర్‌లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు బీటెక్, బీఈ కోర్సులకు ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు జరుగుతాయి. కర్నూలు జిల్లా నుంచి దాదాపు ఆరు వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. తర్వాత మెయిన్ సెషన్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ పరీక్షలకు అర్హత సాధిస్తారు.

ట్రిపుల్ ఐటీకి నీటి కోసం రూ.22 కోట్లు

ఉత్తర్వులు విడుదల చేసిన ఈఎన్‌సీ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 23: కర్నూలు మండలంలోని మునగాలపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి జగన్నాథగట్టు వద్ద ఉన్న ట్రిపుల్ ఐటీకి నీటి సరఫరా కోసం నిర్మిస్తున్న నీటి సరఫరా పథకానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు రూ.22 కోట్లు విడుదల చేస్తూ పబ్లిక్ హెల్త్, అండ్ మున్సిపల్ ఇంజనీర్ ఇన్ చీఫ్ పి. ఆనందరావు నగర పాలక సంస్థ కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేసారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి ప్రతి రోజు 2 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయడానికి పైప్‌లైన్ నిర్మాణం, దిన్నెదేవరపాడులో నీటిని శుద్ధి చేసేందుకు పంప్‌హౌస్, నిల్వ చేసుకునేందుకు ఓవర్‌హెడ్ ట్యాంకు మొదలైనవాటి కోసం కోసం నిధులు విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో ఈ పనులు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు అప్పగించిన వారు చేయకపోవడంతో కార్పొరేషన్‌ను అప్పగించారు.

అంగన్‌వాడీల సమ్మె విరమణ



అభినందన సభలో పాల్గొన్న కార్మిక సంఘం నాయకులు

కర్నూలు(హాస్పిటల్), జనవరి 23: అంగన్‌వాడీ కార్మికులు సమ్మె విరమించారు. విజయవాడలో సోమవారం రాత్రి పొద్దుపోయాక మంత్రి బొత్స సత్యనారాయణ కార్మిక సంఘాలతో చర్చలు జరిపారు. ఎన్నికల తర్వాత జీతాలు పెంచుతామని హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కర్నూలు శ్రీకృష్ణదేవ రాయల సర్కిల్‌లోని ధర్నా చౌక్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్, సీపీఐ జిల్లా కార్యదర్శి జగన్నాథం, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ పి.అంజిబాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల, సీఐటీయూ నాయకులు సుధాకరప్ప, సాయిబాబా, విజయ్, మహ్మద్ రఫీ, ఏఐటీయుసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు అంగన్‌వాడీ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. 42 రోజులపాటు పట్టుదలతో ఉద్యమాన్ని కొనసాగించినందుకు అభినందనలు తెలిపారు. అంగన్‌వాడీల పోరాటం వల్లె ప్రభుత్వం దిగివచ్చిందని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

పిల్లలకు కరువు కాటు



6వ తరగతిలో 51 మంది విద్యార్థులకుగాను 14 మంది మాత్రమే

- బడి పిల్లలు కూడా తల్లిదండ్రులతో వలసబాట
- ప్రభుత్వ బడులలో తగ్గిన హాజరు శాతం
- ఆర్లబండ జడ్పీహెచ్ఎస్‌లో 50 శాతానికి పడిపోయిన హాజరు
- కోసిగి మండలంలో స్కూళ్లలో తగ్గిన హాజరు

కోసిగి, జనవరి 23: కరువుకు కరుణ ఉండదు. పిల్లలు, పెద్దలనే తేడా ఉండదు. ఎవరి జీవితాన్నయినా లోలోపలి నుంచి తొలిచి వేస్తుంది. కరువు చుట్టుముట్టినప్పుడు కుటుంబాలు ధ్వంసమవుతాయి. గ్రామాలు వలసలో కనుమరుగవుతాయి. పిల్లల బతుకు కూడా అంతే. కోసిగి మండలంలో కరువు వల్ల ఊళ్లకు ఊళ్లే వలస వెళుతున్న నేపథ్యంలో పిల్లలు కూడా ఊరికి దూరం అవుతున్నారు. బడి చదువులు వదిలేసి తల్లిదండ్రులతో కలిసి వలస వెళుతున్నారు. కరువుకాటుకు గురైన పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారే ప్రమాదం ఉంది. కోసిగి మండల పరిధిలోని ఆర్లబండ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 415 మంది చదువుకుంటున్నారు. ఇందులో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 222 మంది విద్యార్థులు ఉన్నారు. సోమవారం తరగతి గదుల్లో విద్యార్థుల హాజరు శాతం పూర్తిగా పడిపోయింది. 415 మంది విద్యార్థులకు గాను 199 మంది విద్యార్థులు మాత్రమే హాజరవుతున్నారు. సుమారు 50 శాతం పైగా హాజరు తగ్గిపోయింది. 6వ తరగతిలో 51 మంది విద్యార్థులకు గాను 14 మంది మాత్రమే హాజరయ్యారు. 7వ తరగతిలో 50 మందికి గాను 10 మంది మాత్రమే.. అలాగే 9వ తరగతిలో 29 మందికి గాను 12 మంది మాత్రమే హాజరయ్యారు. మొత్తం తరగతి గదుల్లో 60 శాతం పైగా విద్యార్థుల హాజరు శాతం తగ్గిపోయింది. ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రుల పిల్లలు వలసబాట వెళ్లారు. విద్యార్థులు వెళ్లిన తర్వాత సీజనల్ హాస్టళ్లను అధికారులు కొన్ని చోట్ల ఏర్పాట్లు చేశారు. అయితే కోసిగి మండలంలో ఇప్పటి వరకు ఎక్కడా సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు తల్లిదండ్రుల వెంట వలసలు వెళ్లారు. అసలే అక్షరాస్యతలో దేశంలోనే చిట్టచివరి నుంచి రెండో స్థానంలో ఉన్న కోసిగి మండలం చివరి స్థానానికి వెళ్లే ప్రమాదం ఉందని, ఇక్కడి పరిస్థితులు చూస్తే తెలిసిపోతుంది. తరగతి గదుల్లో విద్యార్థులు లేక బోసిపోతున్నాయి. మండలంలోని ఆర్లబండ హైస్కూల్ ఒక్కటే కాదు.. అన్ని పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

వలస వెళ్లడంతోనే విద్యార్థుల హాజరు శాతం తగ్గింది



తల్లిదండ్రుల వెంట విద్యార్థులు కూడా వలస వెళ్లడంతోనే స్కూల్లో హాజరు శాతం 60కి పైగా తగ్గింది. పిల్లలను వదిలి వలస వెళ్లితే వాళ్లకు రాత్రి వేళల్లో భోజనానికి ఇబ్బంది అని, సంరక్షణ సమస్య అని వారి వెంట తీసుకెళ్తున్నారు.

\- పి.మల్లప్ప, ప్రధానోపాధ్యాయుడు, ఆర్లబండ జడ్పీహెచ్ఎస్



ఆర్లబండ జిల్లా పరిషత్ హైస్కూల్

రాజకీయంగా లోకేశ్ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

జన్మదిన వేడుకల్లో బీటీ నాయుడు



లోకేశ్ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్), జనవరి 23: రానున్న రోజుల్లో యువ నేత నారా లోకేశ్ రాజకీయంగా ఉన్నత శిఖరాలను అధిష్టించాలని ఎమ్మెల్సీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకల్లో భాగంగా నాయకులు కార్యకర్తలతో కలిసి భారీ కేక్‌ను కట్ చేశారు. అంతక ముందు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అవినీతి పాలనపై లోకేశ్ అలుపెరగని పోరాటం కొనసాగిస్తున్నారని అన్నారు. సీఎం అవినీతి, అక్రమాలపై యువగళం పేరుతో రాష్ట్రంలో పాదయాత్ర గత ఏడాది జనవరి 27న కుప్పంలో ప్రారంభించి గాజువాక దాకా 97 రోజులు 3.132 కిమీ నడిచారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరయాదవ్, కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జి టీజీ భరత్, కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్, నాయకులు నంద్యాల నాగేంద్ర, కార్పొరేటర్ కురవ పరమేష్, పీజీ గోపినాథ్, సత్రం రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలంతా టీడీపీకి మద్దతు

కర్నూలు(అర్బన్), జనవరి 23: నగరంలోని ముస్లింలంతా టీడీపీకి మద్దతు ఇస్తున్నారని కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని 6 వార్డులోని గరీబ్ నగర్లో ఇంతియాజ్, ఖరీముల్లా, నూర్‌లు వారి అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ ఇప్పుడున్న నాయకులు ముస్లింను ఓట్ల కోసం వాడుకున్నారే తప్ప ముస్లింలకు మేలు చేయలేదన్నారు. నగరంలో గౌండ, సెంట్రింగ్, వెల్డింగ్ పనులు కల్పించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఇబ్రహీం, షాకీర్, ఫయాజ్, జాకీర్, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

విభజన అంశం కాంగ్రెస్‌పై రుద్దకండి

- అయోధ్య పేరుతో మోదీ రాజకీయం
- డీసీసీ అధ్యక్షుడు బాబురావు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కర్నూలు(అర్బన్), జనవరి 23: అన్ని పార్టీల సమ్మతితోనే ఆనాడు కాంగ్రెస్ రాష్ట్ర విభజన చేసిందని, దానికి కాంగ్రెస్‌ను బాధ్యురాలిని చేయవద్దని డీసీసీ అధ్యక్షుడు కే బాబురావు అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ ఎంపిక సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ, టీడీపీ రెండు పార్టీలు రాష్ట్రంలో అభివృద్ధిని విస్మరించి అప్పుల ఊబిలోకి నెట్టాయని అన్నారు. అనాడు రాష్ట విభజన కాంగ్రెస్‌తో కాకపోతే తామే చేస్తామని పోటీ పడి రాష్ట్రానికి ప్రత్యేక హోదా 15 సంవత్సరాలు కావాలని ఇప్పుడు అన్యాయం చేసిందని అన్నారు. అయోధ్యలో రామ్‌లాల్ ప్రాణప్రతిష్ఠ పేరుతో మోదీ మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 52 మందితో కాంగ్రెస్ నూతన కార్యవర్గం ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో మాజీ డీసీసీ ఎం సుధాకర్‌బాబు, మాజీ మంత్రి మూలింటి మారెప్ప, జాన్‌విల్సన్, చంద్రశేఖర్, జిల్లా మహిళా సేవాదళ్ అధ్యక్షురాలు ఎ.వెంకటలక్ష్మి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బీ బ్రతుకన్న, మైనార్టీ సెల్ సిటీ అధ్యక్షుడు షేక్ ఖాజా హుస్సేన్, కొత్త పేట మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీటీఈ నిబంధనలు ఎత్తివేయాలి

ఆర్‌యూలో నిరసన తెలిపిన ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్



ఆర్‌యూలో రెక్టారుకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్), జనవరి 23: ఏఐసీటీఈ కొత్త నిబంధనలతో డిగ్రీ కళాశాలలు స్వయం ప్రతిపత్తి కోల్పోతాయని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు కునుమర్ల గుండారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యజమానులు నినాదాలు చూస్తూ నిరసన తెలిపారు. అనంతరం రెక్టార్ సీవీ కృష్ణారెడ్డికి ఓ వినతి పత్రం ఇచ్చి సమస్యను వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీకామ్, సీఏ, బీఎస్సీ కంప్యూటర్ కోర్సులు కూడా ఏఐసీటీఈ పరిధిలోకి వెళ్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలిలో ఉన్న డిగ్రీ కాలేజీ, యునివర్సిటీ స్వయం ప్రతిపత్తి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి మొదటి వారంలో 5 రాష్ట్రాల అసోసియేషన్ సభ్యులు డిల్లీలో ఏఐసీటీఈ ఛైర్మన్‌ను కలిసి మాట్లాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే వారంలో ఏఐసీటీఈ నోటిఫికేషన్ పైన హైకోర్టులో కేసు రిజిస్టర్ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ జెర్రిపోతుల రమాణాజీ, గుర్రాల వెంకటరెడ్డి, చింతల విజయభాస్కరరెడ్డి, యాజమాన్యాలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ సూపర్‌వైజర్ల వివరాలు పంపండి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 23: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సమగ్ర శిక్షలో గతంలో పనిచేసిన నాన్ ఫార్మల్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ల వివరాలను పంపాలని ఎస్ ఎస్ ఏ ఏపీసీ విజయ జ్యోతి కుమారి మంగళవారం తెలిపారు. మండల వనరుల కేంద్రంలో పని చేసిన వారి వివరాలను, విద్య అర్హత, సర్వీసు సర్టిఫికెట్ వంటి వివరాలను మండల విద్యాశాఖ అధికారులు పరిశీలించి, ఈ నెల 31 వ తేదిలోగా కర్నూలు జిల్లా కార్యాలయానికి పంపాలన్నారు.

భారీగా పట్టుబడిన కర్ణాటక మద్యం

ఐదుగురి అరెస్టు.. మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ఆదోని రూరల్, జనవరి 23 : కర్ణాటక మద్యం తరలిస్తున్న ఐదుగురిని అదుపులో తీసుకున్నట్లు ఇస్వీ పోలీసులు తెలిపారు. హొళగుంద మండలం ఎల్లార్తికి చెందిన బోయ చంద్రశేఖర్, హెబ్బటంకు చెందిన ఈరప్ప, ఆస్పరి మండలం ములుగుందంకు చెందిన ఆది కేశవరెడ్డి, గార్లపెంటకు చెందిన సురేంద్ర, పెద్దకడుబూరుకు చెందిన కాళింగ మంగళవారం వేర్వేరుగా మూడు ద్విచక్ర వాహనాల్లో కర్ణాటక మద్యం తరలిస్తుండగా, మదిరె, నాగనాథనహళ్ళి శివార్లలో వీరిని అదుపులోకి తీసుకొని వీరి వద్ద నుంచి దాదాపు 1536 కర్ణాటక మద్యం ప్యాకెట్లతోపాటు మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ నిరంజన్ రెడ్డి, ఎస్.ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కర్ణాటక మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

12వ పీఆర్సీ కొలిక్కి వచ్చేనా?

- ఉద్యోగుల డిమాండ్లను పట్టించుకోని ప్రభుత్వం
- మధ్యంతర భృతి ఏమవుతుందో..
- పెండింగ్ బకాయిల మాటే లేదు
- పేరుకే ఉద్యోగుల ఈహెచ్ఎస్
- వైసీపీ పాలనపై ఉద్యోగుల అసహనం

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 23 : 12వ పీఆర్సీ అమలు సమస్య కొలిక్కి వచ్చేలా లేదు. దీని మీద ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు ఎప్పటి నుంచో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. 12వ పీఆర్సీ ఫిట్మెంట్ చేసేలోపు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఉద్యోగులు కోరుతున్నారు. 11వ పీఆర్సీ విషయంలో వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు అభ్యంతరకరమని అంటున్నారు. పైగా పెండింగ్ బకాయిల సొమ్మును ప్రభుత్వ పథకాలకు దారి మళ్లించింది. ప్రభుత్వం విధానం వల్ల ఉద్యోగుల ఆర్థికపరమైన సమస్యలు దీర్ఘకాలికంగా పరిష్కారం కావడం లేదు. రోజువారి అవసరాలకు అప్పులు చేస్తున్నారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవుల తదితర నగదును చెల్లించకుండా సంవత్సరాల తరబడి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఉద్యోగస్థులు అంటున్నారు. వారి ఖాతాలలో ఉండాల్సిన సొమ్ము కనపడటం లేదు. ప్రతి నెల మొదటి పని రోజున ఇవ్వాల్సిన జీతం 15 రోజుల తర్వాత ఇస్తున్నారు.

పెండింగ్‌లో ఉన్న బకాయిలు

2022 జనవరి నాటికి పీఆర్సీ డీఏ అరియర్లు రూ.7,382 కోట్లు, కొత్త డీఏ అరియర్లు రూ.4,884 కోట్లు, పీఎఫ్‌లోన్లు పార్ట్‌ఫైనల్ పేమెంట్లు సుమారుగా రూ.1000 కోట్లు, ఏపీజీఎల్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్లు రూ.330 కోట్లు, సరెండర్ లీవులు రూ.4,500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి విడుదల చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు కోరుతున్నారు.



కారుణ్య నియామకాలను పట్టించుకోని ప్రభుత్వం

సహజ, కరోన మరణాలు సంబంధించిన కుటుంబ సభ్యులలో ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. గత మూడు సంవత్సరాల నుంచి వైసీపీ ప్రభుత్వం కారుణ్య నియామకాలు చేపట్టడం లేదు. దీంతో ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాయి.

పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించాలి

రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ అమలుపై జూలై 12వ తేదీ 2023 సంవత్సరంలో విశ్రాంతి ఐఏఎస్ అధికారి అయిన మన్మోహన్ సింగ్‌ను నియమిస్తూ జీవో 68 ప్రభుత్వం విడుదల చేసింది. పీఆర్సీ ఫిట్మెంట్ చేసేలోపు ఆరు నెలల ముందు మధ్యంతర భృతిని అమలు చేయాలి. 11వ పీఆర్సీని రివర్స్ పీఆర్సీగా ఉద్యోగులు అభివర్ణించారు. సామాజిక భద్రత లేని సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. పాత పెన్షన్ అమలు చేస్తామని చెప్పిన సీఎం ఎన్నికల హామీని గుర్తు చేశారు. మాట మార్చి మడమ తిప్పి జీపీఎస్ అమలు చేయడం పట్ల ఉద్యోగులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

పేరుకే ఈహెచ్ఎస్

అనారోగ్యం బారిన పడిన ఉద్యోగులు హెల్త్‌కార్డులను తీసుకుని కార్పొరేట్, ప్రైవేటు హాస్పిటల్స్‌కి వెళితే హాస్పిటల్స్ యాజమాన్యాలు ఈహెచ్ఎస్ చికిత్స డబ్బులు రావని బహిరంగంగా చెప్పడం పలు విమర్శలకు తావిస్తోంది. ఉద్యోగుల హెల్త్ కార్డుకు ప్రయోజనం లేకుండా పోయిందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అయినా ప్రతి ఉద్యోగి హెల్త్ కార్డుకు డబ్బులు కడుతునే ఉన్నారు. తమ డబ్బులు తీసుకుని వైద్యం చేయకపోవడం విడ్డూరంగా ఉందని వారు విమర్శిస్తున్నారు. చేతిలో డబ్బులు ఉంటే వైద్యం.. లేకపోతే అనారోగ్యం అనే పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది.

బకాయిలు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే



రాష్ట్రంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులకు నిర్దిష్ట సమయంలో ప్రభుత్వం ఆర్థిక బకాయిలను చెల్లించడం లేదు. 11వ పీఆర్సీ అరియర్స్ 5 డీఏలు, సీపీఎస్ ఉద్యోగులకు డీఏ 90 శాతం క్యాష్ రూపంలో పెండింగ్, సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్ జమ, 3 సంవత్సరాలకు పైగా సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, సంవత్సరానికి పైగా మెడికల్ బిల్స్, 10 నెలలుగా పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇలా బకాయిలు దాదాపు రూ.30వేల కోట్లు ఉన్నట్లు తెలుస్తోంది. గత పీఆర్సీ చరిత్రల్లో ఎన్నడూ లేని విధంగా 11వ పీఆర్సీలో ప్రభుత్వం ఉద్యోగ వర్గానికి తీవ్ర నష్టం కలగజేసింది. పై నష్టాలు 12వ పీఆర్సీలో సరి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

-జి.హృదయరాజు, రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర సెక్రటరీ జనరల్, ఏపీజేఏసీ

చిత్తశుద్ధి లేని ప్రభుత్వం



రాష్ట్రంలో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు కార్మికులు పెన్షనర్లకు 12వ పీఆర్సీ ప్రకటనకే పరిమితమైంది. దీని అమలుకు సంబంధించిన కార్యాలయ సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించలేదు. ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ వారికి చెల్లించాల్సిన బకాయిలను పూర్తి స్థాయిలో ఇంత వరకు చెల్లించలేదు. 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి. ప్రాథమిక విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో.నెం.117ను వెంటనే రద్దు చేయాలి.

- గోకారి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగులను శత్రువులుగా చూడడం బాధాకరం



ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లను ప్రభుత్వం శత్రువులుగా చూస్తోంది. ఇది చాలా బాధాకరం. మాకు రావాల్సిన బకాయిలను సైతం ప్రభుత్వం దోపిడీ చేస్తుంది. దన్నారు. తమ ప్రభుత్వం ఉద్యోగుల పక్షాన ఉన్నదని చెప్పుకొనే ప్రభుత్వం మోసం చేస్తున్నది. సరెండర్ లీవులు చెల్లించాలి. ఏపీజీఎల్ఐసీ పెండింగ్స్ బకాయిలు విడుదల చేయాలి.

- వెంగళ్‌రెడ్డి, ఏపీ జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

చంద్రబాబుతోనే బీసీల సంక్షేమం

- జయహో బీసీ సభకు విశేష స్పందన
- పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత

ఓర్వకల్లు, జనవరి 23: రాష్ట్రంలోని అన్ని వర్గాలతో పాటు బీసీలను ఆదుకునేది టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత, టీడీపీ నంద్యాల పార్లమెంటు అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం ఓర్వకల్లులో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓర్వకల్లు బస్టాండు నుంచి రచ్చకట్ట వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సుంకులమ్మ, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో హుశేనాపురం నుంచి ఓర్వకల్లు వరకు భారీ ర్యాలీ బైకులతో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలే దేవుళ్లు.. సమాజమే దేవాలయం.. అన్న లక్ష్యంతో నందమూరి తారకరామారావు టీడీపీని ఏర్పాటు చేశారన్నారు. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్ సైకోగా మారి బీసీలను పట్టించుకోలేదన్నారు. బీసీలంతా ఏకమై 2024 ఎన్నికల్లో సైకో జగన్‌ను గద్దె దించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. బీసీలకు రాజ్యాధికారం ఇవ్వాలన్న ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు తీసుకువచ్చిందన్నారు. చంద్రబాబు నాయుడు బీసీల సంక్షేమం కోసం కృషి చేశారని, మండలంలో ఉక్కు పరిశ్రమ, సోలార్, విమానాశ్రయం, ఆయుధాల పరిశ్రమ తెచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. జగన్ పాలనలో బీసీలను పూర్తిగా అణగదొక్కారని ధ్వజమెత్తారు. ఎలాంటి అధికారాలు, విధులు లేకుండా బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. బీసీ సబ్‌ప్లాన్ నిధుల్లో రూ.75వేల కోట్లు దారి మళ్లించి అన్యాయం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నంద్యాల పార్లమెంటు ఉపాధ్యక్షురాలు పార్వతమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, సుధాకర్‌రావు, మహబూబ్‌బాషా, రామగోవిందు, లక్ష్మీకాంతరెడ్డి, విజయుడు, అల్లాబాబు, అబ్దుల్లా, మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌరు చరిత

రా కదిలి రా బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పెందుర్తి వెంకటేష్

పత్తికొండ, జనవరి 23: పత్తికొండలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నిర్వహించనున్న రా కదిలి రా బహిరంగ సభకు సంబంధించి ఏర్పాట్లను రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబుతో కలిసి పరిశీలించారు. ఆదోని రహదారిలో టీడీపీ నాయకుడు ప్రమోద్‌కుమార్ రెడ్డి 16 ఎకరాల వెంచర్‌లో బహిరంగ సభ ఏర్పాటుకు ఇప్పటికే స్థలాన్ని పరిశీలించారు. బహిరంగ వేదిక, భోజనాలు, వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్ వంటి ఏర్పాట్లపై చర్చించి మ్యాప్ సిద్ధం చేశారు. ఈ సందర్భంగా కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ ఈనెల 25న పత్తికొండలో అధినేత చంద్రబాబు రా కదిలి రా ప్రోగ్రాం షెడ్యూల్ ఖరారు కాగా అనివార్య కారణాలతో ఈ కార్యక్రమం వాయిదా పడిందన్నారు. త్వరలో పార్టీ అధిష్ఠానం నుంచి షెడ్యూల్ తేదీ తెలుస్తుందని అన్నారు. రా కదిలి రా బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన కోసం టీం నిర్వాహక సభ్యులలో ఒకరైనా పెందుర్తి వెంకటేష్ పరిశీలనకు వచ్చిరూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారన్నారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి

ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ



కరపత్రాలను విడుదల చేస్తున్న సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

ఆదోని, జనవరి 23 : జాతీయ రహదారులపై ప్రమాదాలు జరగకుండా పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ, సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, గత నెలలో జరిగిన రోడ్ సేఫ్టీ సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాలలో భాగంగా ఆదోని పట్టణంలో పంజారాపోలు గోశాల సమీపంలో ఉన్న రోడ్డు మలుపు దగ్గర, నెట్టేకల్ క్రాస్ రోడ్ దగ్గర తీసుకోవలసిన జాగ్రత్తలు, స్పీడ్ బ్రేకర్లు, రోడ్డుపై రంగులు సూచనల గురించి ఆరా తీశారు. ఇంకా పెండిగ్‌లో ఉన్న వాటిని కూడా పూర్తి చేయాలని, ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. వాహనదారుల భద్రత కోసం ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్ వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్కూల్ ఆటోలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణిస్తుంటే వాటిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం జాతీయ రహదారి వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీలు శివ, నారాయణస్వామి, సీతారామయ్య, ఆర్టీవో నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శిశిర దీప్తి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్, రఫి, పంచాయతీ రాజ్, ఈఈ వెంకట ప్రసాద్, పోలీసు, రెవెన్యూ, శాఖ అధికారులు పాల్గొన్నారు.

భర్తపై ఫిర్యాదు

ఆదోని రూరల్, జనవరి 23 : అదనపు కట్నం తేవాలని వేధిస్తున్న భర్తపై భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆదోని మండలం చిన్నపెండేకల్లుకు చెందిన విజయలక్ష్మికి మూడు సంవత్సరాల క్రితం ఆదోనికి చెందిన జగదీష్‌తో వివాహమైంది. కొద్ది రోజులుగా భర్త తనను అదనపు కట్నం కోసం అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నాడని మంగళవారం తాలుక పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ ఎర్రిస్వామి తెలిపారు.

నేటి నుంచి షర్మిల పర్యటన

నంద్యాల టౌన్, జనవరి 23: పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఈనెల 24 నుంచి మూడు రోజుల పాటు నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గంలో విస్తృత పర్యటన చేపట్టనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ మంగళవారం తెలిపారు. ఏఐసీసీ పార్లమెంట్ పరిశీలకులు బండి జక్కరయ్య సమక్షంలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు పర్యటనలు చేపట్టనున్నట్లు చెప్పారు. 24వ తేదీన శ్రీశైలం, నందికొట్కూరు, 25న డోన్, బనగానపల్లె, ఆళ్లగడ్డ నియోజక వర్గాలు, 26న నంద్యాల, పాణ్యం నియోజకవర్గాల్లో పర్యటిస్తారని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి నియోజక వర్గాల పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చెక్‌పోస్టు ఎంవీఐపై కేసు నమోదు

హోంగార్డు, డ్రైవర్‌తోపాటు మరో ఆరుగురికి రిమాండ్

కర్నూలు, జనవరి 23: పంచలింగాల చెక్‌పోస్టులో అనధికార నగదుతో చిక్కిన ఎంవీఐ సునీల్ కుమార్‌తో పాటు మరో ఏడుగురిపైన కేసులు నమోదు చేశారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపిన వివరాల మేరకు.. ఏసీబీ అధికారులు సోమవారం తెల్లవారుజామున పంచలింగాల సమీపంలో ఉన్న రవాణా శాఖ చెక్‌పోస్టులో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఓ ఆరుగురు ప్రైవేటు వ్యక్తులతోపాటు హోంగార్డు, డ్రైవర్ ఆధ్వర్యంలో ఎంవీఐ సునీల్ కుమార్ దగ్గర రూ.2.02 లక్షల అనధికార నగదు గుర్తించారు. అంతరాష్ట్ర సరిహద్దు ద్వారా వెళ్లే రవాణా వాహనాలన్నీ చెక్‌పోస్టుల్లో మామూళ్లు ఇస్తున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో వీరిపై ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వీరిపై కేసు నమోదు చేశారు. ఎంఈవై సునీల్ కుమార్, హోంగార్డు యూసుఫ్, డ్రైవర్ మధు, ప్రైవేటు వ్యక్తులైన మనోజ్ కుమార్ (శరీన్‌నగర్), రామచంద్రగౌడు (పంచలింగాల), అనిల్ (ధర్మపేట), రవికాంత్ (చిన్నమార్కెట్), ఆవుల భాస్కర్ (తిమ్మాపురం)లపై కేసు నమోదు చేశారు. వీరందరినీ మంగళవారం రాత్రి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు వీరికి రిమాండ్ విధించింది.

ఆసుపత్రి సెక్యూరిటీ గార్డులపై దాడి



ప్రభుత్వాసుపత్రి సెక్యూరిటీ గార్డుల నిరసన

నంద్యాల క్రైం, జనవరి 23 : నంద్యాలలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంగళవారం సెక్యూరిటీ గార్డులపై దుండగులు దాడి చేశారు. సోమవారం అర్ధరాత్రి రెండు వర్గాలు ఘర్షణపడి చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. క్షతగాత్రులను పరామర్శించేందుకు పట్టణంలోని బైటిపేటకు చెందిన కొంత మంది యువకులు మద్యం తాగి ఆసుపత్రికి వచ్చారు. మంగళవారం ఆసుపత్రి ఆవరణలో ఉన్న సెక్యూరిటీ గార్డులపై బైటిపేటకు చెందిన యువకులు ఘర్షణకు దిగారు. సెక్యూరిటీ గార్డులైన సాయి, బాల ఆంజనేయులు, పెద్దన్న, కృష్ణపర్‌లపై దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై సెక్యూరిటీ గార్డులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

దాడికి పాల్పడిన దుండగులను అరెస్టు చేయాలి

నంద్యాల ప్రభుత్వాసుపత్రి సెక్యూరిటీ గార్డులపై బైటిపేటకు చెందిన దుండగులు దాడి చేయడం దారుణమని, వారిని వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్, సెక్యూరిటీ గార్డులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వాసుపత్రి ఆవరణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వాసుపత్రిలో సెక్యూరిటీ గార్డుల పట్ల దాడులు కొనసాగడం బాధాకరమని అన్నారు.

కప్పల్ నగర్‌లో 'నగరమా మేలుకో'



కరపత్రం పంపిణీ చేస్తున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జనవరి 23: నగరంలోని 45 వార్డు కప్పల్ నగర్‌లో మంగళవారం టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో నగర మా మేలుకో కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ పాల్గొన్నారు. వార్డులోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి టీడీపీ మ్యానిఫేస్టోను వివరించారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుంకన్న, అబ్బాస్, రవి, రామాంజనేయులు, గున్నా మార్క్, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి: తెలుగుదేశం పార్టీతోనే కర్నూలు నగరాభివృద్ధి సాధ్యమని కార్పొరేటర్ క్రైపా పద్మలత అన్నారు. మంగళవారం నగరంలోని మౌర్యఇన్ హోటల్‌లో తన అనుచరులతో టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ సమక్షంలో ఆమె టీడీపీలో చేరారు. ఇప్పటికే 17వ వార్డుకు చెందిన కార్పొరేటర్ క్రైపా పద్మవతి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో పార్టీలో చేరారు. తాజాగా అనుచరులతో కలిసి మరోసారి పార్టీ కండువా కప్పుకున్నారు. కార్పొరేటర్ పద్మలత మాట్లాడుతూ టీడీపీ హయంలో కర్నూలు నగరాభివృద్ధిలో పాలు పంచుకుందామనే ఉద్దేశంతో వైసీపీని వీడి టీడీపీలో చేరినట్లు తెలిపారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ మరి కొద్ది రోజుల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడబోతుందన్నారు. పార్టీలో చేరిన వారిలో దుర్గ, లత, క్రైప రామక్రిష్ణారెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్, కేవీ సుబ్బారెడ్డి, బాబ్జీ, విజయకుమార్, భారతి సంధ్య, మారుతీ శర్మ పాల్గొన్నారు.

అనంతపురం బాలుడికి అరుదైన ఆపరేషన్



బాలుడితో సర్జరీ యూనిట్-2 చీఫ్ రామకృష్ణ నాయక్, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), జనవరి 23: కార్పొరేట్ హాస్పిటల్స్‌లో నిర్వహించే పెద్ద ఆపరేషన్లు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చాయి. అనంతపురం జిల్లా రేకుల గుంటకు చెందిన 15 ఏళ్ల సాయి గత మూడేళ్ల నుంచి కడుపు ఉబ్బరం, ప్లేట్‌లెట్లు తక్కువ కావడం, రక్తవాంతుల సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ నెల 11వ తేదీన బాలుడు తీవ్ర అస్వస్థతతో సర్జరీ యూనిట్-2లో అడ్మిషన్ అయ్యారు. అక్కడ చీఫ్ డా.రామకృష్ణ నాయక్ బాలుడ్ని అడ్మిషన్ చేసుకొని పరీక్షలు చేశారు. ఈనెల 13వ తేదీన బాలునికి యూనిట్ చీఫ్ రామకృష్ణనాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ సబీరా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు చైతన్యవాణి, మన్సూర్‌బాషా, అనస్థీషియా వైద్యులు శారద దాదాపు 2.5 గంటలు శ్రమించి ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. బాలుడు ఆరోగ్యంగా కోలుకున్నాడు. మంగళవారం డిశ్చార్జ్ చేశారు.

డాక్టర్లకు ఏడాదికి 35 సెలవులే..

కర్నూలు(హాస్పిటల్), జనవరి 23: వైద్యులు ఏడాదికి 35 సెలవులు మాత్రమే ఉపయోగించుకోవాలని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డి ఆదేశించారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరి హాలులో హెచ్‌వోడీలతో ఆయన, ప్రిన్సిపాల్ డా.పి.సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో అత్యవసర పరికరాలు కొనేందుకు పర్చేస్ కమిటీని నియమించినట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీన స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రి కాలిన రోగుల విభాగం, కేఎంసీలోని పరీక్ష హాల్‌ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని వీటికి అందరూ వైద్యులు తప్పక హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీలు రామకృష్ణనాయక్, రాధారాణి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కర్నూలు, జనవరి 23: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పెద్దపడకానాకు చెందిన వడ్డె పుష్ప(26) తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త అజయ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈమెకు ఒక కొడుకు, కూతురు సంతానం. ఈమె గత కొద్ది కాలంగా కడుపు నొప్పితో బాధపడుతుండేది. జీవితంపై విరక్తి చెందిన ఆమె ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బంధువులు గుర్తించి ఆసుపత్రికి తీసుకెళ్లేలోగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మైనర్ల డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

కర్నూలు, జనవరి 23: నగరంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి డ్రైవింగ్ చేస్తున్న మైనర్లపై టూటౌన్ పోలీసులు కొరడా ఝుళిపించారు. సీఐ ఇంతియాజ్ ఆధ్వర్యంలో పలు కూడళ్లలో మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతున్న పది మంది మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. వీరందరిపైన రూ.10వేలు జరిమానా విధించారు. వీరిని స్టేషన్ పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఘనంగా నారా లోకేశ్ జన్మదినం



హుశేనాపురంలో కేక్ కట్ చేస్తున్న మల్లెల రాజశేఖర్

కల్లూరు, జనవరి 23: జిల్లాలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ పాణ్యం, నందికొట్కూరు ఇన్‌చార్జిలు గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డిలు పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రతో రాష్ట్రంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయన్నారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, అర్బన్ వార్డుల కన్వీనర్ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, జె.గంగాధర్‌గౌడ్, కాసాని మహేష్‌గౌడ్, పీయూ మాదన్న, వంగాల జనార్దన్ రెడ్డి, ఎన్వీ రామకృష్ణ, సంపతి లక్ష్మీరెడ్డి, వాకిటి మాదేష్, కె.ధనుంజయ, సెరవాడ జాఫర్, చిన్నమారెన్న, పీవీ రమణారెడ్డి, శేఖర్‌చౌదరి పాల్గొన్నారు.

కర్నూలు(లీగల్): నారా లోకేశ్ జన్మదిన వేడుకలను స్థానిక బార్ అసోసియేషన్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.నాగభూషణం నాయుడు ఆధ్వర్యంలో మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.నాగముని కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. న్యాయవాదులు శంకర్‌సింగ్, విక్రమ్‌సింగ్, మోహన్‌బాబు, తిరుపతయ్య, వజ్రం భాస్కర్, అనిల్‌కుమార్, రవికాంత్‌ప్రసాద్, బీసీ శేషన్న, మద్దిష్ పాల్గొన్నారు.



కర్నూలు బార్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో..

కర్నూలు(రూరల్): నారా లోకేశ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కర్నూలు నగరంలోని నెహ్రూనగర్‌లో టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి తన నివాసంలో తెలుగు మహిళలు, కార్యకర్తల మధ్య కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు బొగ్గుల దస్తగిరి, కోడుమూరు నియోజకవర్గ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్య క్షుడు ఆకెపోగు జయన్న, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు పసుపుల మురళీకృష్ణ, గొల్లకృష్ణ, పంచలింగాల ముద్దప్ప, మహిళలు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో పండ్లు పంపిణీ: నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా కోడుమూరు టీడీపీ యువనాయకుడు బొగ్గుల దస్తగిరి ఆధ్వర్యంలో కర్నూలు రూరల్ మండలం పసుపుల సమీపంలో అక్షిత అంధుల పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు పాఠశాలలో అంధుల మధ్య కేక్‌ను కట్ చేశారు.

ఓర్వకల్లు: మండలంలోని హుశేనాపురం గ్రామంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకుడు మహబూబ్‌బాషా, నాయకులు సుధాకర్, రామగోవిందు, బజారు, వేణు, జయకృష్ణ, షంషుద్దీన్ పాల్గొన్నారు.

కోడుమూరు(రూరల్): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు యల్లప్పనాయుడు అధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తిరుమలనాయుడు, గోపాల్‌నాయుడు, ఆంధ్రయ్య, బడేసాబ్ గౌడ్, లక్ష్మయ్యశెట్టి, అయ్యస్వామి పాల్గొన్నారు.

గూడూరు: పట్టణంలో నారా లోకేశ్ జన్మదినం పురస్కరించుకుని నగర పంచాయతీ, మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు బుడ్డంగలి, కోడుమూరు షేక్షావలి, సృజన్, పౌలు, విజయ్, అడివప్ప, నరసింహులు, గౌండ కుమార్, నాగరాజు, విజయ్, మధు పాల్గొన్నారు.

● గూడూరు పట్టణంలో లోకేశ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్రగోపాల్ నాయుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్నూలు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి దండు సుందర్ రాజు, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్‌బాబు, మైనార్టీ నాయకులు మన్నన్‌బాషా, రహిమాన్, గిడ్డయ్య, రఘు, చిలక శ్రీనివాసులు, వెంకట్రాముడు, సులేమాన్ పాల్గొన్నారు.

సి.బెళగల్: నారా లోకేశ్ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ఎన్టీఆర్ పార్కులో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం మాజీ ఎంపిటీసీ ధనంజయుడు, బాలాజీ వెంకటేశ్, రాజు, రంగన్న కేక్ కట్ చేసి ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, బెడ్లు, పాలు పంపిణీ చేశారు.



కేక్ కట్ చేస్తున్న గౌరు దంపతులు



టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న మహిళలు



గూడూరులో..



కోడుమూరులో..



సి.బెళగల్‌లో..

ట్రాక్టర్ ర్యాలీని విజయవంతం చేయండి

కర్నూలు(న్యూసిటీ), జనవరి 23: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాల ఉపసంహరించాలని కోరుతూ ఈనెల 26న తలపెట్టిన ట్రాక్టర్ ర్యాలీని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామక్రిష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా అఖిల భారత కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు కొత్తబస్టాండు నుంచి కలెక్టరేట్ వరకు ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ రంగసంస్థలను అంబానీనికి కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు నష్టం కలిగించే చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారాయణ, సహాయ కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 23: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో మంగళవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం వలన పాఠశాల, కళాశాల విద్య సంక్షోభంలో పడిందన్నారు. విద్యా సంస్థలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్ ఫీజు బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్టీయూ, ఏఐఎస్ఎఫ్ నాయకులు సుధీర్, షాభీర్ బాషా పాల్గొన్నారు.

38వ రోజూ క్లాప్ డ్రైవర్ల సమ్మె

కర్నూలు(న్యూసిటీ), జనవరి 23: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ క్లాప్ డ్రైవర్లు చేస్తున్న సమ్మె మంగళవారానికి 38వ రోజుకి చేరింది. కార్పొరేషన్ ఎదుట చేపట్టిన సమ్మెనుద్దేశించి సీఐటీయూ నగర నాయకుడు కుమార్ మాట్లాడుతూ ఇన్నిరోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో డ్రైవర్లు షఫి, రాజేష్, బాబ్జి, వెంకటేష్ పాల్గొన్నారు.

డోలమైట్ అక్రమంగా తరలిస్తే చర్యలు

కర్నూలు(అర్బన్), జనవరి 23: ఉమ్మడి కర్నూలు జిల్లాలో డోలమైట్‌ను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. మంగళవారం డోన్ పరిసర ప్రాంతాల్లో డోలమైట్ తరలిస్తున్న లారీ, ట్రిప్పర్‌ను సీజ్ చేశారు. అనంతరం యాజమాన్యాలను గుర్తించి రూ. 25 వేల జరిమానా విధించారు. ఈ దాడుల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ముడుమాలలో పల్లె నిద్ర

సి.బెళగల్, జనవరి 23: మండలంలోని ముడుమాల గ్రామంలో కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, ఎస్ఐ మన్మధవిజయ్ పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా కోడుమూరు సీఐ మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు తమ సమస్యలు ఎమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈసమావేశంలో గ్రామ పెద్ద జగదీశ్వరరెడ్డి, సర్పంచ్ బతుకమ్మ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

ఓర్వకల్లు, జనవరి 23: వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరయ్యారు. అంతకుముందు ఆయా శాఖ అధికారులు గతంలో చర్చించిన విషయాలు, వాటి పురోగతిపై సమావేశంలో చర్చించారు. మీదివేముల ఎంపీటీసీ పద్మనాభరెడ్డి మాట్లాడుతూ ఏపీఐఐసీలో భూముల్లో అవకతవకలు జరిగాయన్నారు. పూడిచెర్ల ఎంపీటీసీ లక్ష్మీదేవి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో అవినీతి జరిగిందని, ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఓర్వకల్లు, తిప్పాయపల్లె, కన్నమడకల, తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని సభా దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, జడ్పీటీసీ రంగనాథగౌడు, ఎంపీడీవో శివనాగప్రసాద్, సర్పంచులు చదువుల సుజాతమ్మ, అయ్యస్వామి, నాగేశ్వరమ్మ, మధుకేశన్న, ఎంపీటీసీలు ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎల్లయ్య, సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ: ఓర్వకల్లు గ్రామానికి చెందిన జడ్పీ హైస్కూల్ చైర్మన్ రోళ్లపాడు మద్దిలేటి ఆర్థిక సమస్యలతో మంగళవారం పురుగుల మందు తాగాడు. అతడి స్థానిక ఆసుపత్రి తరలించారు. ఈవిషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని బాధితుడిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

ప్రజలకు శాపంగా రాజ్‌విహార్ రోడ్డు నిర్మాణం

కర్నూలు(న్యూసిటీ), జనవరి 23: రాజ్‌విహార్‌లో చేపడుతున్న రోడ్డు నిర్మాణం ప్రజలకు శాపంగా మారిందని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి అన్నారు. రాజ్‌విహార్ బస్టాపు వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను సంఘం ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ రాజ్‌విహార్ సెంటర్‌లో రోడ్డుకు అడ్డంగా ఉన్న రెండు స్తంభాలను తొలగించాలని నగర పాలక సంస్థకు రూ.2 లక్షలు చెల్లించిన ఇప్పటివరకు విద్యుత్ శాఖాధికారులు తొలగించడంలో అలసత్వం వహిస్తున్నారని మండిపడ్డారు. స్తంభాలు తొలగించకపోవడంతోనే పనులు ఆగిపోయాయని కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారని అన్నారు. ఆయన వెంట సభ్యులు యాకోబు, ఏ.వెంకటేశ్వర్లు, కృష్ణ, రాజు ఉన్నారు.

ఘనంగా సుభాస్ చంద్రబోస్ జయంతి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 23: స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సుభాస్ చంద్రబోస్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రామకృష్ణ, విజయ శేఖర్, మల్లికార్జున, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

కర్నూలు(న్యూసిటీ): నేతాజీ సుభాష్ చంద్రబోసు జయంతి వేడుకలను అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం సీఆర్ భవన్‌లో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం, సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డిలు నేతాజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి శ్రీరాములు, బాబయ్య పాల్గొన్నారు.



సుభాస్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్

టీడీపీ మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన

కర్నూలు(రూరల్), జనవరి 23: కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం దిగువపాడు, శివరాంపురం గ్రామాల్లో మంగళవారం సాయంత్రం 8 గంటల ప్రాంతంలో కోడుమూరు టీడీపీ యువ నాయకుడు బొగ్గుల దస్తగిరి మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, హరిరెడ్డి, భాస్కర్, ఆనంద్, మాజీ ఎంపీటీసీ అజయ్, సురేష్, రామోజి, మాజీ ఎంపీటీసీ అల్లిపీర, రఘుబాబు రెడ్డి, నరేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

సమ్మెలోకి సెర్ప్ ఉద్యోగులు

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 23: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుంచి సమ్మెకు దిగనున్నట్లు జిల్లా సెర్ప్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కృష్ణుడు, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర, కన్వీనర్ అబ్దుల్ రెహిమాన్ తెలిపారు. డీఆర్‌డీఏ కార్యాలయం ముందు సెర్ప్ ఉద్యోగులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు(అర్బన్), జనవరి 23: యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.దీప్తి అన్నారు. మంగళవారం సీ.క్యాంప్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిర్వహించిన జాబ్ మేళాకు ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన నిరుద్యోగులు హాజరయ్యారు. 22 మంది ఎంపికయ్యారని ఆమె తెలిపారు. కియా కార్ల పరిశ్రమ, నవభారత్ ఫర్టిలైజర్స్ సంస్థకు చెందిన ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ ఉపాధి కల్పనాధికారి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాయ్‌పై అవగాహన

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 23: స్థానిక జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఎలక్ట్రానిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ట్రాయ్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఐటీఎస్ అధికారి వీఎస్ రాజు మాట్లాడుతూ డిజిటల్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వినియోగదారుడు మోసానికి గురైనప్పుడు ఎవరికి ఫిర్యాదు చేసి, పరిష్కారాలను ఎలా పొందాల్లో వివరించారు. విభాగాధిపతి డాక్టర్ తిరుపాల్, వెంకటాచలతి, సీఐ వేణుగోపాల్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన చిత్రలేఖన పోటీలు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 23: కర్నూలు నంద్యాల చెక్‌పోస్టులో కేంద్రీయ విద్యాలయంలో చిత్రలేఖన పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో నవోదయ, స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 9వ తరగతి నుండి 12వ తరగతికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానమంత్రి పరీక్ష పే చర్చల్లోని ఎగ్జామ్ వారియర్ మంత్రాలతోపాటు నేతాజి సుభాష్‌చంద్రబోస్, ఆదిత్య ఎల్-1, భారత్ క్రీడా విజయం, చంద్రయాన్-3 మొదలైన అంశాలలో ఒకటి ఎన్నుకుని విద్యార్థులు వారి ప్రతిభను ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలుగా నాగరాజు, శ్రీధర్‌రాజు, సంఘ ఆంజనేయులు వ్యవహరించారు. ఉత్తమ ఐదు బహుమతులు సాధించిన ఎం.విశ్వసందేష్ (సెయింట్ జోసెఫ్, కర్నూలు), ఎస్.సజియాబాను (వికాస్ విద్యానికేతన్), కె.పవన్‌సాయి (జవహర్ లాల్ నవోదయ బనవాసి, కర్నూలు), ఏ.రితుశ్రీ (కేంద్రీయ విద్యాలయ, కర్నూలు), యు. ఉషశ్రీ (ప్రతిభ మోడల్ స్కూల్)లు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. గెలుపొందిన విజేతలకు ప్రిన్సిపల్ పాయల్ ప్రియదర్శిని సర్టిఫికెట్లు అందజేశారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

సి.బెళగల్, జనవరి 23: సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చు అని వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కొండాపురం, గుండ్రేవుల గ్రామాలలో రబీలో రైతులు సాగు చేసిన వరి పంట దిగుబడిని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఈవోలు సిద్దు, వెంకటేశ్, నాయక్, రైతులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి

ఓర్వకల్లు, జనవరి 23: ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రజలకు సూచించారు. మంగళవారం మండలంలోని పాలకొలను గ్రామంలో ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, రమేష్, సుబ్బారెడ్డి, రంగనాథగౌడు, తిప్పన్న, లోటర్ బాషా, తహసీల్దార్ శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

వాము క్వింటం రూ.25,111 రైతుల్లో సంతోషం

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 23: కర్నూలు మార్కెట్ యార్డులో వాము ధర పరుగులు పెడుతోంది. మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి రైతులు కర్నూలు మార్కెట్ యార్డుకు వాము తీసుకువచ్చారు. మంగళవారం కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటం వాముకు గరిష్ఠంగా 25,111, మధ్యస్థ ధర రూ.15,060, కనిష్ఠ ధర రూ.2,079 దక్కింది. ఉల్లి ధర రోజు రోజుకూ తగ్గిపోతుండటంతో రైతుల కన్నుల్లో నీరు ఆగడం లేదు. మంగళవారం కర్నూలు మార్కెట్ యార్డుకు రూ.3,043 క్వింటాళ్ల ఉల్లిని విక్రయానికి రైతులు తెచ్చారు. గరిష్ఠంగా రూ.1,456, మధ్యస్థ ధర రూ.1,161, కనిష్ఠంగా కేవలం రూ.329 మాత్రమే రైతు చేతికి వచ్చింది. తేజ, బేడ తదితర రకాల మిర్చికి కర్నూలు యార్డులో మంచి ధర లభిస్తోంది. గరిష్ఠంగా రూ.19,211, ఎండుమిరప రూ.12,599, కనిష్ఠ ధర రూ.2,999 ధర దక్కింది. వేరుశనగ కాయల ధర నిలకడగా ఉంది. గరిష్ఠంగా రూ.7,700, మధ్యస్థ ధర రూ.6,200, కనిష్ఠ ధర రూ.5,232 రైతులకు అందింది.

రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం: మేయర్

కర్నూలు(న్యూసిటీ), జనవరి 23: కర్నూలు నగర అభివృద్ధికి రూ.5 కోట్లు వెచ్చించనున్నట్లు మేయర్ బీవై.రామయ్య తెలిపారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ అండ్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ అధ్యక్షతన, కమిషనర్ భార్గవతేజ ఆధ్వర్యంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో 18 తీర్మానాలకు కమిటి తీర్మానం తెలిపింది. ఇందులో షాపుల లీజులు, రూ.5 కోట్ల అభివృద్ధి పనులవంటి తీర్మానాలకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర శివారులో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించామన్నారు. మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 19వ వార్డుకే ఎక్కువ మొత్తం రూ.కోటిన్నర కేటాయించుకోవడంలపై పలువురు కార్పొరేటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమీషనర్ రామలింగేశ్వర్, సాయిసంఘ కమిటీ సభ్యులు సుజాత, సుదర్శన్‌రెడ్డి, నాగలక్ష్మీరెడ్డి, నగరూరు శ్రీనివాసరావు, ఎస్ఈ డి.వేణుగోపాల్, ఎంఈ శేషసాయి, ఎంహెచ్‌ఓ కే.విశ్వేశ్వరెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

ఏఐసీసీ పార్లమెంట్ అబ్జర్వర్ నంద్యాల జిల్లాలో పర్యటన

కల్లూరు, జనవరి 23: ఈనెల 24 నుంచి 26 వరకు ఏఐసీసీ నంద్యాల పార్లమెంట్ అబ్జర్వర్ బండి జక్కారయ్యతో కలిసి నంద్యాల జిల్లాలో పర్యటించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహాయాదవ్ తెలిపారు. మంగళవారం నంద్యాల చెక్‌పోస్టులోని దామోదరం సంజీవయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐసీసీ నంద్యాల పార్లమెంట్ అబ్జర్వర్ బండి జక్కారయ్య ఈనెల 24న శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో పర్యటిస్తారని, 25న డోన్, బనగానపల్లె, ఆళ్ళగడ్డ, 26 నంద్యాల, పాణ్యం నియోజకవర్గాల్లో పాల్గొంటారని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుపై కాలయాపన వద్దు

కర్నూలు(అర్బన్), జనవరి 23: ప్రధాని నరేంద్ర మోడీ ఎస్సీ వర్గీకరణ బిల్లును కమిటీల పేరుతో కాలయాపన చేయవద్దని రాయలసీమ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు అనంత రత్నం మాదిగ అన్నారు. బుధవారం నగరంలోని ఎల్బీజీ నగర్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ డిమాండ్‌ను ప్రతి సారి కేంద్ర ప్రభుత్వాలు కమిటీలు వేసి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇలాగే వ్యవరించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు డీ. నాగన్న, త్యాగరాజు, కల్లూరు మండల కన్వీనరు స్వామి మాదిగ పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 23: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ధర్నా చౌకు వద్ద కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలకంఠ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రామాంజనేయులు, ప్రశాంత్ పాల్గొన్నారు.

శుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సి.బెళగల్, జనవరి 23: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీవో తిమ్మక్క హెచ్చరించారు. మండంలోని పోలకల్లు గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని మంగళవారం గ్రామస్థులు డీఎల్‌పీవోకు ఫిర్యాదు చేశారు. పోలకల్లు గ్రామ పంచాయతీలోని మురుగుకాలువలను, తాగునీటి ట్యాంక్‌ల దగ్గర ఉన్న ము రుగు కుంటలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి డీఎల్‌పీవో ఆదేశించారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

మద్దికెర, జనవరి 23: మద్దికెర గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న భవాని, అశ్విని, రంగస్వామి, ఉపేంద్ర, ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సవిత తెలిపారు. మంగళవారం ఆదర్శ పాఠశాలలో ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనా విద్యార్థులను అభినందించారు.

ఓటరు జాబితాలో తప్పులు ఉన్నాయి

మద్దికెర, జనవరి 23: మండలంలో రెవెన్యూ అధికారులు విడుదల చేసిన ఓటరు జాబితాలో తప్పుల తడకగా ఉన్నాయని పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజినేయులు, ఎస్సీ సంఘం నాయకుడు పారా విరోభలు అన్నారు. మంగళవారం మద్దికెర గ్రామంలో ఓటరు జాబితాను ఇంటింటికి తీసుకెళ్లి ప్రజల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ మద్దికెర గ్రామంలోని ఆయా పోలింగ్ బూత్‌లలో మేము గ్రామ వదిలి వెళ్లిన వారి పేర్లు, మరణించిన వారి పేర్లు, వివాహం చేసుకుని వెళ్లిన వారి పేర్లు ఇచ్చినప్పటికి ఓటరు జాబితాలో అలాగే ఉన్నాయన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఓటరు జాబితాలో అనర్హుల పేర్లు తొలగించాలని కోరారు.

వైభవంగా దేవర

మద్దికెర, జనవరి 23: మద్దికెర గ్రామంలోని మద్దమ్మకుంట సమీపాన వెలసిన రజకుల ఆరాధ్య దేవత గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం రజకసంఘం ఆధ్వర్యంలో గంగమ్మకు పొంగళ్లతో చలువ కుండలు పెట్టి గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మూలవిరాట్ గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించి ఆకుల పూజ నిర్వహించారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏబీవీపీ పూర్వ నాయకులు

ఆదోని టౌన్, జనవరి 23 : స్వతంత్ర పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను మంగళవారం బీజేపీ కార్యాలయంలో యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విట్టా రమేష్ మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కోవడం కోసం అప్పట్లోనే ఒక దృఢమైన ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసిన యుద్ధవీరుడు సుభాష్ చంద్రబోస్ అని, ఆయన నేటి యువతకు ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో రమేష్ యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి రాహుల్ చౌదరి, ఉపాధ్యక్షుడు పురుషోత్తం, కార్యదర్శులు మహేష్, భద్రి, కాశి పాల్గొన్నారు.

ఆదోని(అగ్రికల్చర్): నేటి యువతకు సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తి అని ఏబీవీపీ మాజీ రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాసాచారి అన్నారు. మంగళవారం సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు మోహన్, వినయ్ రాము పాల్గొన్నారు.

ఆలూరు: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1లో హెచ్ఎం రాధాబాయి ఆధ్వర్యంలో సుభాష్‌చంద్రబాబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త కవిరాజు, వీరేష్, రామాంజి, చిన్నబాబు, చెన్నబసవ, భాస్కర్, హరికృష్ణ, ఎలిజబెత్, సరోజ, ఈరన్న పాల్గొన్నారు.

జగన్‌కు కాలం చెల్లింది: టీడీపీ

గోనెగండ్ల, జనవరి 23: జగన్ ప్రభుత్వాన్ని కాలం చెల్లింది ఇక జగన్ అరాచకాలకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని జిల్లా టీడీపీ కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, జిల్లా సాంస్కృతి విభాగం ప్రధాన కార్యదర్శి కౌలుట్లయ్యనాయుడు అన్నారు. మంగళవారం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం రావాలంటే మళ్లీ చంద్రబాబు సీఎం కావాలని వారు అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే స్పందనను చూసి వైసీపీ నాయకులకు భయం పట్టుకుందని వారు అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించి, మళ్లీ చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఆదోని రూరల్, జనవరి 23: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయ బీసీ సాధికారిక రాష్ట్ర కమిటీ సభ్యులు ఆరేకల్లు రామకృష్ణ డిమాండ్ చేశారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ ఆలూరులో చేపట్టిన రిలే నిరాహారదీక్షలకు రామకృష్ణ ఆధ్వర్యంలో వాల్మీకులు మంగళవారం బయల్దేరారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, లేనిపక్షంలో తమ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. కార్యక్రమంలో గణేకల్లు విరుపాక్షి, కల్లుబావి మల్లీ, బసన్న, అలసందగుత్తి సోము, బంగారయ్య, ఎల్లప్ప, తూకారం, జగదీష్ పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయంలో లక్ష మంది వాల్మీకి సోదరులతో వాల్మీకి విజయభేరి త్వరలో నిర్వహిస్తామని రాష్ట్ర ఐక్య వాల్మీకి ఐక్య పోరాట కమిటి రాష్ట్ర అధ్యక్షులు, జనసేన మంత్రాలయం ఇన్‌చార్జి, బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ బి.లక్ష్మన్న అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వాల్మీకుల్లోని అన్ని సంఘాలను కలుపుకొని రౌండుటేబుల్ సమావేశం ఏర్పాటు చేసి జేఏసీగా ఎన్నుకొని వాల్మీకి విజయభేరి సభ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో బీవీ రవిచంద్ర, వెంకటేశ్, దుల్లాయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే పట్టణాభివృద్ధి



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, అధికారులు

ఆదోని టౌన్, జనవరి 23 : పట్టణంలో కేంద్ర నిధులతోనే అభివృద్ధి పనులు జరిగాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విట్టా రమేష్, అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజ్ గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక విక్టోరియా పేట, ఇందిరా నగర్ ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం కార్యక్రమం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో నాయకులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈలు చలపతి, రాజు నాయక్, వైద్య అధికారులు వినోద్, మహేష్, మెప్మా అధికారి వీరారెడ్డి, ఐసీడీయస్ అధికారులు, బీజేపీ నాయకులు దేంద్రకుమార్ ఉరుకుంద గౌడ్, మణికంఠ, సాగర్ కుమార్, అంజి పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

పత్తికొండటౌన్, జనవరి 23: స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో పొదుపు మహిళలకు మంజూరైన ఆసరా చెక్కులను ఎమ్మెల్యే శ్రీదేవి మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కవిత, ఎంపీపీ నారాయణదాసు, జడ్పీటీసీ ఉరుకుందమ్మ, నాయకులు సోమశేఖర్, శ్రీరంగడు, నాగరాజు, ఏపీఎం మధుబాబు పాల్గొన్నారు.

ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు



ఆదోనిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు



ఆస్పరిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



ఆలూరులో కేక్ కట్ చేస్తున్న వైకుంఠం శివ ప్రసాద్, జ్యోతి

ఆదోని, జనవరి 23: ఆదోని నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు స్వగృహంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కాకర్ల వెంకటేష్ చౌదరి పాల్గొని కేక్ కటింగ్ చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మీనాక్షినాయుడు మాట్లాడారు.యువగళం పాదయాత్ర ద్వారా నారా లోకేశ్ వైసీపీ ప్రభుత్వంపై దండయాత్ర చేసి ప్రజలను చైతన్యవంతుల్ని చేశాడన్నారు. టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు, రాష్ట్ర ప్రజలను వైసీపీ అరాచకాల నుంచి కాపాడేందుకు నారా లోకేశ్ చేస్తున్న పోరాటానికి అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. నారా లోకేశ్ జీవితంలో ఆరోగ్యంగా, మంచి ఉన్నతమైన స్థానంలో ఉండాలని ఆ భగవతుడిని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుంటప్ప, రామస్వామి, రంగన్న బిచ్చె అంజనప్ప, మదిరె వీరేష్, వీరేంద్ర, మహానంది పాల్గొన్నారు.

గోనెగండ్ల: వైసీపీ నేతల గుండెలలో దడ పుట్టించిన నాయకుడు నారాలోకేశ్‌కే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం గోనెగండ్లలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలు టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. బస్టాండ్ ప్రాంగణం, టీడీపీ కార్యాలయాలలో మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీడీపీ కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, నూరహమ్మద్, రమేష్‌నాయుడు, రంగస్వామినాయుడు, భారతం రహంతుల్లా, ఫక్రుద్దీన్, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, మదీనా, కులుమాల రాముడు, మిన్నల్ల, బడేసా, రామాంజినేయులు, శ్రీధర్ పాల్గొన్నారు.

పత్తికొండ: నారా లోకేశ్ జన్మదిన వేడుకలు పత్తికొండ టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కేఈ శ్యాంబాబు కేకను కట్‌చేసి నారా లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు సాంబశివారెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, హోటల్ శీను, బీటీ గోవిందు, సోమ్లానాయక్, లోక్‌నాథ్, ఈశ్వరప్ప, విజయమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవనకొండ: స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా చేశారు. కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, బడిగింజల రంగన్న, మల్లికార్జునగౌడ్, వీరేష్, ఉచ్చీరప్ప, నాగరాజుగౌడ్, మల్లయ్య, రామారావునాయుడు, రాజశేఖర్‌గౌడ్, ఐటీడీపీ నాయకులు పెద్దయ్య, రవి, బాలతేజ పాల్గొన్నారు.

వెల్దుర్తి: పట్టణంలో స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం టీడీపీ జాతీయ కార్యదర్శి నారాలోకేష్ పుట్టిన రోజు వేడుకలు మండల అధ్యక్షుడు బలరాంగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడు, పుల్లగుమ్మి నాగేశ్వరరెడ్డి, రామళ్లకోట రామకృష్ణ ఆచారి, కలగొట్ల రామకృష్ణ, రత్నపల్లె ఆనందు, మంగంపల్లె శ్రీను, శశి, సుధాకర్‌గౌడు, ఎర్రబజారు, వీరభద్రుడు, చిన్నగోపాల్‌గౌడు, నారాయణ పాల్గొన్నారు.

ఆలూరు: టీడీపీ జాతీయ ఆకర్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా జరిగాయి. ఆలూరు. టీడీపీ మాజీ ఇన్‌చార్జి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి అధ్వర్యంలో ఆలూరు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి, స్థానిక బస్టాండ్‌లో కేక్ కట్ చేశారు.

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున చౌదరి ఆధ్వర్యంలో స్థానిక మారెమ్మ గుడి దగ్గర నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. మాజీ జడ్పీటీసీ దేవేంద్రప్ప, టీడీపీ నాయకులు అనిల్, గౌతం, కృష్ణ, జాహర్ పాల్గొన్నారు.

● నారా లోకేశ్ జన్మదిన సందర్భంగా ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ కార్యాలయంలో టీడీపీ యువనేత గిరి మల్లేష్‌గౌడ్ కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

● స్థానిక టీడీపీ కార్యాలయంలో నారా లోకేశ్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణ, భాస్కర్, చంద్రశేఖర్, దేవేంద్ర, నరసప్ప, రామాంజినేయులు, పాల్గొన్నారు.

ఆస్పరి: నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా వాల్మీకి సాధికారిక రాష్ట్ర కార్యదర్శి తిమ్మన్న ఆధ్వర్యంలో స్థానిక గాంధీ పార్క్‌లో మంగళవారం నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ క్రిష్ణ యాదవ్, టీడీపీ యువ నాయకుడు కే సతీష్ కుమార్, అంజనేయ, మహేష్, వెంకటేష్, ఫొటో వీరేష్, పూజారి మహేష్, మారేష్, లోకేష్ పాల్గొన్నారు.

హొళగుంద: నారా లోకేశ్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించినట్లు టీడీపీ మండల కన్వీనర్ తిప్పయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రతో అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టించారని అన్నారు. కార్యక్రమంలో కురువ కాళికా ప్రసాద్, చిన్నహ్యాట శేషగిరి, కాకి సీతయ్య, మురళి, మైనార్టీ నాయకుడు మహమ్మద్ ఆదాం, వందవాగలి శేషప్ప, మంగలి చంద్రశేఖర్, రాజు, దిడ్డి తిక్కస్వామి, నరేష్‌గౌడ, బుడగ జంగల రామాంజినేయులు పాల్గొన్నారు.

కౌతాళం: నారా లోకేశ్ జన్మదిన వేడుకలను మంగళవారం కౌతాళంలో టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి తిక్కారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప స్వగృహంలో పార్టీ శ్రేణులతో కలిసి తిక్కారెడ్డి కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకను జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, తెలుగు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు, నాయకులు రమేష్‌గౌడ్, బాపురం వెంకటరెడ్డి, టిప్పు సుల్తాన్, కురుగోడు, రాజానందు, రాజబాబు, నీలకంఠరెడ్డి, రంగస్వామి, నాగేంద్ర పాల్గొన్నారు.

మంత్రాలయం: నారా లోకేశ్ జన్మదిన వేడుకలు మంత్రాలయంలో ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ అధ్యక్షతన తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు విజయరామిరెడ్డి, అశోక్ రెడ్డి, మాలపల్లి చంద్ర, శంకర్ నాయక్, ఎస్ఎం గోపాల్ రెడ్డి ఎంపీటీసీ మేకల వెంకటేశ్, శివ, రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండలంలోని గుంటుపల్లె గ్రామంలో టీడీపీ నాయకులు వెంకటరాముడు ఆధ్వర్యంలో నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రామచంద్రుడు, ప్రభాకర్, నారాయణ, శివనారాయణ, రాముడు, శేఖర్, ధను, భాస్కర్‌లు పాల్గొన్నారు.



గోనెగండ్లలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ



మంత్రాలయంలో...



టీడీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న కేఈ శ్యాంబాబు



కౌతాళంలో తిక్కారెడ్డి ఆధ్వర్యంలో..



దేవనకొండలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



హొళగుంద టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



వెల్దుర్తిలో...

తప్పుల తడకగా ఓటర్ల జాబితా

ఎమ్మిగనూరు, జనవరి 23: ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామ పరిధిలోని బనవాసి ఫారం ఓటర్ల జాబితా తప్పుల తడకగా మారింది. ఓ మహిళ చనిపోతే తొలగించకుండా నిర్లక్ష్యం చేశారు. జాబితాలో డబుల్ ఎంట్రీ ఉన్న మరో మహిళకు సంబంధించి ఒక ఓటుకు బదులు రెండూ తొలగించారు. ప్రధానంగా బనవాసి ఫారం బూత్ నెం 174లోకి వచ్చే జవహర్ నవోదయ విద్యాలయంలో పని చేస్తూ బదిలీ అయిన సిబ్బంది శ్రీనివాసులు, ఆయన భార్య రేఖ, వెంకటగిరి, తేజ్ రాజ్ ధఖాల్, విజయశారద, శేషయ్య సునీల్, గుర్నాథ్, సాజిదా బేగం, ఖాన్‌తో పాటు మరి కొంతమంది బదిలీ అయినప్పటికీ జాబితాలో పేర్లు ఉన్నాయి. వీరి ఓట్లను తొలగించాలని టీడీపీ నాయకుడు వీరనాగప్ప బీఎల్‌ఓను కోరగా చివరకు ఆయన ఓటునే తొలించారు. అలాగే బోయ బూపాల్, బోయ సాయిలతో పాటు 172 బూత్‌లో ఒక మహిళ ఓటరుగా ఉండగా ఆమె పేరు 174లో కూడా ఉంది. అలాగే స్థానికంగా నివాసం ఉంటున్న అస్మద్ బాను పేరు ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీ ఉండటంతో ఒకటి తొలగించాలని కోరారు. అయితే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి రెండు ఓట్లు లేకుండా చేశారు.

కోలుకోలేక కౌలు రైతు మృతి

ఆదోని, జనవరి 23 : ఆదోని పట్టణంలోని కల్లుబావి వీధి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో నివసిస్తున్న కౌలు రైతు చిన్న నరసప్ప చికిత్స పొందుతూ మృతి చెందాడు. నరసప్ప కొన్నేళ్లుగా ఏడున్నర ఎకరాలు భూమి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పత్తి, శనగ పంటలు సాగు కోసం రూ.3.50 లక్షలు పెట్టుబడి పెట్టాడు. పంట చేతికందకపోవడంతో కుటుంబ సభ్యులంతా బెంగళూరుకు వలస వెళ్లారు. బిల్డింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి కింద పడ్డాడు. ప్రథమ చికిత్స అనంతరం ఆదోనిలో చికిత్స చేయిస్తున్నారు. కోలుకోలేక నరసప్ప మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

తల్లి మృతితో అనాథలైన చిన్నారులు



మృతదేహం వద్ద రోధిస్తున్న అనాథలైన చిన్నారులు

మంత్రాలయం, జనవరి 23: మండలంలోని చిలకలడోన గ్రామంలో తల్లి ప్రశాంతమ్మ మృతితో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. కుమార్, ప్రశాంతమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. ఐదేళ్ల క్రితం భర్త మృతి చెందాడు. ప్రశాంతమ్మ (37) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందింది. దీంతో పిల్లలు రాజేష్, రాకేష్, రాహుల్ అనాథలయ్యారు. ప్రశాంతమ్మకు ఉండడానికి ఇల్లు, సొంత పొలం లేదు. వీరికి ఆపన్నహస్తం అందించాలని గ్రామ ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

వైసీపీకి ప్రజా సమస్యలు పట్టవు: బీవీ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

గోనెగండ్ల, జనవరి 23: ప్రజా సమస్యలు వైసీపీ ప్రభుత్వానికి పట్టవని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బీవీ జయనా గేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మూడో రోజు రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని అచ్చుకట్లవీధి, కిందిగేరి, ముస్లిం కాలనీ, చింతముని స్వామి దేవాలయం వీధిలో నిర్వహించారు. ఇందులో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ అనే కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందు ఆయన పార్టీ జెండాను గ్రామంలో ఎగుర వేశారు. గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, రంగస్వామినాయుడు, రాంపురం రఫిక్, రమేష్‌నాయుడు, నూరహమ్మద్, కులుమాల రాముడు, కులుమాల చాంద్, బడేసా పాల్గొన్నారు.

రా.. కదిలిరా సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న తిక్కారెడ్డి

మంత్రాలయం, జనవరి 23: తెలుగుదేశం పార్టీ నిర్వహించే రా.. కదిలిరా సభకు విచ్చేస్తున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సభను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం మంత్రాలయంలో ఆయన మాట్లాడుతూ పత్తికొండలో 28న రా.. కదిలిరా సభకు మంత్రాలయం నుంచి 15వేల మంది తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కోసిగి, కౌతాళం, మంత్రాలయం, పెద్దకడుబూరు మండలాల నాయకులతో సమావేశమై భారీ సంఖ్యలో వాహనాలు ఏర్పాటు చేసి లక్ష మందితో చంద్రబాబు సభను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్, ఎస్ఎం గోపాల్ రెడ్డి, విజయరామిరెడ్డి, యేబు, మాలపల్లి చంద్ర, అండే హనుమంతు, నాగరాజు, శివ, చావిడి వెంకటేశ్, సుజ్ఞానం, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు : ఆర్ఐ

కౌతాళం, జనవరి 23: గ్రామంలో అర్హులైన వారందరికి ఇళ్ల పట్టాలు అందిస్తామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌గౌడ్ అన్నారు. ఎరిగేరి గ్రామ సచివాలయం నందు సోమవారం గ్రామ సర్పంచ్ గోవిందు అధ్యక్షతన గ్రామంలో ఇళ్ల పట్టాల పంపిణీపై గ్రామ సభ నిర్వహించారు. సర్వే నెంబరు 253లో 2006లో ఇళ్ల పట్టాలు పొందిన వారికి పట్టాలను హద్దులు చూపిస్తామని చెప్పారు. గ్రామ సభలో వీఆర్వో నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే పీఏ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్దుర్తి, జనవరి 23: ఫ్యాన్‌కు ఉరివేసుకొని చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రం సుంకేసుల గ్రామానికి చెందిన బి రామాంజనేయులు వెల్దుర్తి మండలం మాదార్‌పురం గ్రామానికి చెందిన నాగసోమేశ్వరిని వివాహం చేసుకొని అక్కడే నివసిస్తున్నాడు. ఇతడు వెల్దుర్తిలో కూల్‌డ్రింక్ షాప్‌తోపాటు ఇతర వ్యాపారాలు చేస్తున్నాడు. వ్యాపారంలో ఆర్థికంగా ఇబ్బందులు రావడంతో, భార్యాభర్తలు సోమవారం అర్ధరాత్రి వరకు గొడవపడ్డారు. కుటుంబసభ్యులు ఇంట్లో నిద్రపోతుండగా రామాంజనేయులు హాలులో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించాక మెరుగైన చికిత్స కోసం కర్నూలు సర్వజనవైద్యశాలకు తరలించారు. అక్కడ కోలుకోలేక మంగళవారం ఉదయం మృతిచెందాడు. భార్య నాగసోమేశ్వరి ఫిర్యాదు మేరకు వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మీ సేవలు చాలు.. సెలవులో వెళ్లండి

● వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం

పెద్దకడుబూరు, జనవరి 23: 'మీ వల్ల కాంట్రాక్టర్లు.. సర్పంచ్‌లు చాలా ఇబ్బంది పడుతున్నారు.. మీ సేవలు చాలు.. ఇక మీరు సెలవులో వెళ్లాలని' వ్యవసాయ సలహామండలి చైర్మన్ పురుషోత్తం రెడ్డి పీఆర్ ఏఈ మల్లయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రం పెద్దకడుబూరు ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్యసమావేశం ఎంపీపీ శ్రీ విద్య అధ్యక్షతన వాడివేడిగా జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పీఆర్ ఏఈ మల్లయ్యను చూస్తే భయపడి పోతున్నారని బిల్లులు సక్రమంగా పెట్టడం లేదని ఫిర్యాదు చేస్తున్నారు. దయచేసి మీరు సెలవుపై వెళ్తే ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో పనులు చేయించుకుంటామన్నారు. కల్లుకుంట సర్పంచ్ ఇస్మాయిల్ కలుగజేసుకొని పనులు చేయాలని మీరే చెబుతారు.. బిల్లులు చేయాలని చెబితే మధ్యలో ఆపేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. పదిలక్షలతో సీసీ రోడ్డు వేస్తే సగం బిల్లు మాత్రమే పంపి మిగతా బిల్లు పెండింగ్‌లో పెట్టారని, ఏఈ వల్ల చాలా నష్ట పోతున్నామని మండిపడ్డాడు. ఇందుకు పీఆర్ ఏఈ మల్లయ్య స్పందిస్తూ మీరు ఎన్ని మీటర్లు వేశారో ఆమేరకు బిల్లులు పంపించామని, సెలవులో వెళ్లమంటే వెళ్లిపోతానని అన్నారు. హనుమాపురం సర్పంచ్ ఇందిరమ్మకు బదులుగా ఆమె భర్త ఈరన్న సమావేశంలో పాల్గొనటాన్ని అభ్యంతరం తెలుపుతూ టీడీపీ ఎంపీటీసీ శశిరేఖ మాట్లాడుతూ మండల సమావేశానికి సభ్యులు కాని వారు హాజరయ్యారని, వారిని బయటకు పంపాలని అధికారులను కోరారు. దీంతో ఇరువురు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎంపీటీసీ శశిరేఖను సర్పంచ్ భర్త ఏకవచనంతో సంబోధించటంతో ఆయనపై శశిరేఖ తీవ్రంగా మండిపడ్డారు. ఇందుకు ఎంపీడీఓ ప్రభాకర్, మిగతా సభ్యులు కలుగజేసుకోవటంతో సర్పంచ్ భర్త ఈరన్న సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఈ సమావేశంలో రాష్ట్ర రోడ్ల డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీలు ఇర్ఫాన్ పటేల్, ముత్తమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

డాక్టర్‌పై ఉన్నతాధికారులకు నివేదిక

ఆలూరు, జనవరి 23 : ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలో ఉన్న పాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డా శాంతి పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, ఎఫ్‌డీపీ రవి విచారణ చేపట్టారు.

శ్రీమఠానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, జనవరి 23: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన శారదమ్మ లనే భక్తురాలు రూ.లక్ష అన్నదానం కోసం విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి తెలిపారు. మంగళవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.లక్ష చెక్‌ను విరాళం ఇచ్చినట్లు తెలిపారు. వారిని పీఠాధిపతి ఆశీర్వదించారు.

కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ఆదోని (అగ్రికల్చర్), జనవరి 23 : పట్టణంలోని ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని చెబుతున్న కార్పొరేట్ కళాశాలపై చ్యలు తీసుకోవాలని పీడీఎస్‌వో డివిజన్ అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి శివ కోరారు. మంగళవారం పీడీఎస్‌వో కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ నారాయణ కళాశాలలో ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి విద్యార్థుల పై ఫీజులు చెల్లించాలని ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు పండక, విద్యార్థుల తల్లిదండ్రులు వలస వెళ్లారని, పరీక్షలు దగ్గరకు వస్తుండడంతో ఫీజులు చెల్లించకపోతే హాల్ టికెట్లు ఇవ్వమని భయపెడుతున్నారంటూ ఆరోపించారు. కార్యక్రమంలో హరి, సాయి, గోవిందు, ప్రవీణ్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం: కేఈ



మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు

మద్దికెర, జనవరి 23: టీడీపీ అదినేత నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. మంగళవారం మండలంలోని బురుజుల గ్రామంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. సమావేశంలో గూడూరు ధనుంజయుడు, బురుజుల ఎర్రిస్వామి పాల్గొన్నారు.

అదుపుతప్పి బోర్‌వెల్ లారీ బోల్తా

దేవనకొండ, జనవరి 23 : పి. కోటకొండ సబ్ స్టేషన్ వద్ద బోర్‌వెల్ లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన్న ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టడంతో వెంటనే సమీప సబ్ స్టేషన్లో విద్యుత్ సప్లయ్ నిలిపివేశారు.